## క్లుప్తంగా

### గణితంలో విద్యార్థుల ప్రతిభ

చిట్యాల : మండలంలోని నేరడ జెడ్పీహెచ్ఎస్ విద్యార్థులు సదిశ గణిత టాలెంట్ టెస్ట్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచారని ఆ పాఠశాల హెచ్ఎం జి.రాంమోహన్, గణిత ఉపాధ్యాయుడు దాసరి శ్రీరాములు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్రలలో వివిధ పరీక్ష కేంద్రాల్లో నిర్వహించిన గణిత పరీక్షలో కందగట్ల కీర్తన, కొన్నె హన్సిక, పొట్టబత్తిని ఫణిశ్రీలు ప్రతిభ చాటారు. విద్యార్థులకు సదిశ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కార్పొరేట్ స్థాయి విద్యను ప్రైవేటు ఇంటర్ కాలేజీలో అందిస్తారు.

### బీఎస్పీ అభ్యర్థిగా సాయితేజరెడ్డి

నల్లగొండ టౌన్ : నల్లగొండ నియోజకవర్గ బహుజన సమాజ్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిగా డాక్టర్ కోమటిరెడ్డి సాయితేజరెడ్డిని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ప్రకటించారు. అనంతరం బుధవారం స్థానిక పార్టీ కార్యాలయంలో అభ్యర్థి సాయితేజరెడ్డి విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ బీఎస్పీ అభ్యర్థిగా తాను శుక్రవారం నామినేషన్ దాఖలు చేస్తానన్నారు. రాష్ట్ర మహిళా విభాగం కార్యదర్శి నర్రా నిర్మల, జిల్లా ఇన్‌చార్జ్ పి.అనిల్, గ్యార మారయ్య, ఎలిజబెత్, కాన్షీరాం, చాంద్‌పాషా, పెరిక అభిలాష్, వినోద్‌చారి, బొజ్జ నర్సింహ, కొండ నరేందర్, లింగస్వామి, నవీన్, సైదులు, వంటెపాక యాదగిరి, భాను, శివరామకృష్ణ, అభినవ్, సాయికుమార్, దున్న లింగస్వామి, పాల్గొన్నారు.

### మధ్యాహ్న భోజన కార్మికురాలు మృతి

మర్రిగూడ : శివన్నగూడ ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజన కార్మికురాలిగా పనిచేస్తున్న మల్లం కలమ్మ అనారోగ్యంతో బుధవారం మృతి చెందింది. కలమ్మ మృతదేహాన్ని సర్పంచ్ చిట్యాల సబితయాదగిరిరెడ్డి, ప్రధానోపాధ్యాయులు కె.జనార్దన్, ఎస్ఎంసీ చైర్మన్ లింగస్వామి, ఉపాధ్యాయులు, విద్యార్థులు సందర్శించి నివాళులర్పించారు.

### ఫ్లయింగ్ స్క్వాడ్‌ల పర్యటన

మర్రిగూడ : అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో మర్రిగూడ, నాంపల్లి మండలాలకు మూడు ఫ్లయింగ్ స్క్వాడ్ టీంలను ఏర్పాటు చేశారు. బుధవారం ఫ్లయింగ్ స్క్వాడ్ టీం సభ్యులు మండల కేంద్రంలో పర్యటించారు. ఒక ఫ్లయింగ్ స్క్వాడ్ టీం సభ్యుడితోపాటు ఇద్దరు కానిస్టేబుళ్లు, కెమెరామెన్, ఒక వాహనం ఉంటుంది.


### కరపత్రం ఆవిష్కరణ

మర్రిగూడ : ఈ నెల 11న హైదరాబాద్‌లో నిర్వహించనున్న మాదిగల విశ్వరూప మహాసభకు మండలం నుంచి మాదిగలు భారీగా తరలి రావాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ఇరిగి శ్రీశైలం కోరారు. బుధవారం మర్రిగూడ మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద మహాసభ కరపత్రాన్ని ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. జిల్లా తిరుమలేష్, ముదిగొండ రమేష్, అశోక్, గ్యార గిరి, నర్సింహ, రవి తదితరులు పాల్గొన్నారు.

### కాంగ్రెస్‌లో చేరనున్న నాంపల్లి ప్రజాప్రతినిధులు

నాంపల్లి : మండలంలోని పలువురు ప్రజాప్రతినిధులు కాంగ్రెస్ పార్టీలో చేరనున్నట్లు సమాచారం. జెడ్పీటీసీ ఎలుగోటి వెంకటేశ్వర్‌రెడ్డి నాంపల్లి మండలంలోని పసునూర్ గ్రామంలో ఉన్న తన గెస్ట్‌హౌస్‌లో బుధవారం మండలంలోని పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. తాను కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నానని, తనకు మద్దతుగా కాంగ్రెస్‌లో చేరితే అండగా ఉంటానని హామీ ఇచ్చినట్లు తెలిసింది. మునుగోడు ఎమ్మెల్యే అభ్యర్థి కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి పార్టీలోకి రావాలని వారిని ఆహ్వానించారని సమాచారం. జెడ్పీటీసీతోపాటు వైస్ ఎంపీపీ పానగంటి రజినివెంకన్నగౌడ్, పాశం జగన్‌మోహన్‌రెడ్డి, పలవురు ముఖ్య నాయకులు ఉన్నట్లు తెలుస్తోంది.

### ప్రలోభాలకు లొంగవద్దు



అవగాహన కల్పిస్తున్న చొల్లేటి ప్రభాకర్

నల్లగొండ టౌన్ : ఎన్నికల్లో వివిధ రాజకీయ పార్టీలు పెట్టే ప్రలోభాలకు లొంగవద్దని నల్లగొండ నియోజకవర్గ స్వతంత్ర అభ్యర్థి, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి చొల్లేటి ప్రభాకర్ అన్నారు. బుధవారం స్థానిక ఎస్పీటీ మార్కెట్‌లో ఓటు హక్కుపై ఓటర్లకు అవగాహన కల్పించారు. స్వతంత్ర అభ్యర్థిగా బరిలో నిలిచిన తనకు ఓటు వేసి గెలిపిస్తే నియోజకవర్గాన్ని అభివృద్ధి బాటలో నడిపిస్తానన్నారు.

### వర్షానికి తడిసిన వరి, పత్తి

మునుగోడు : మండలవ్యాప్తంగా మంగళవారం రాత్రి కురిసిన అకాల వర్షానికి వరి, పత్తి పంటలు సాగు చేసిన రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. కోతకు సిద్ధంగా ఉన్న వరిచేలు నేలకు వాలి వడ్లు రాలిపోయాయి. కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చిన ధాన్యం తడిసి ముద్దయ్యింది. పత్తి పంట చేతికి వచ్చినా కూలీల కొరతతో తీయించకపోవడంతో పత్తి తడిసి ముద్దయ్యింది.

### పోలీసుల కవాతు

నాంపల్లి : మండల కేంద్రంలోని ప్రధాన వీధుల్లో సీఐ నవీన్‌కుమార్ ఆధ్వర్యంలో బుధవారం పోలీసులు కవాతు నిర్వహించారు. ఎస్ఐ లచ్చిరెడ్డి, పోలీసులు తదితరులు ఉన్నారు.

# ఊపందుకున్న నామినేషన్ల దాఖలు

నల్లగొండ : నల్లగొండ నియోజకవర్గంలో బుధవారం 9 నామినేషన్లు దాఖలయ్యాయి. సీపీఎం అభ్యర్థి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి రెండు సెట్ల నామినేషన్ దాఖలు చేయగా, ఇండిపెండెంట్ అభ్యర్థులుగా గండికోట వెంకటలక్ష్మణ్, పొట్టబత్తుల సైదులు, తన్నీరు యాదయ్య, అఫ్రోజ్, చింతక్రింది స్వామికుమార్, జెనిగల రాములు నామినేషన్లు సమర్పించారు. ప్రజా ఏక్తా పార్టీ నుంచి చేదుబుద్ది రమేష్ నామినేషన్లు సమర్పించారు.

**మునుగోడులో 12 మంది 15 నామినేషన్లు**

చండూరు : మునుగోడు అసెంబ్లీ స్థానానికి బుధవారం 12 మంది 15 నామినేషన్లను ఆర్ఓ దామోదర్‌రావుకు అందజేశారు. బీఆర్ఎస్ అభ్యర్థి కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి తరఫున బీఆర్ఎస్ నాయకులు, హరి ప్రసాద్‌గౌడ్ (స్వతంత్ర), ఏర్పుల గాలయ్య (ధర్మసమాజ్ పార్టీ), అంగోతు సికిందర్ (స్వతంత్ర), కట్ట ప్రభాకర్‌రెడ్డి (అలియన్స్ ఆఫ్ డెమోక్రటిక్ రిఫామ్స్ పార్టీ), మెగావత్ చందు (స్వతంత్ర), ఏలె వెంకటేశం ( భారతీయ స్వదేశీ కాంగ్రెస్ పార్టీ), ఉదారి మల్లేశ్ (స్వతంత్ర), ఎర్ర పరమేశ్ (స్వతంత్ర), దుడుకు లక్ష్మీనారాయణ (స్వతంత్ర), మాదగాని వెంకటేశ్వర్లు (స్వతంత్ర), బీఎస్పీ అభ్యర్థిగా అందోజు శంకరాచారి నామినేషన్ దాఖలు చేశారు. మొత్తంగా ఇప్పటివరకు 20 మంది అభ్యర్థులు 28 నామినేషన్లను దాఖలు చేశారు.




ఇండిపెండెంట్ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేస్తున్న గండికోట వెంకట లక్ష్మణ్



పొట్టబత్తుల సైదులు



స్వామికుమార్




నామినేషన్ పత్రాలు అందజేస్తున్న సి. రమేష్




నామినేషన్ పత్రాలు అందజేస్తున్న ఇండిపెండెంట్ అభ్యర్థి తన్నీరు యాదయ్య

**ఐదు నామినేషన్ల స్వీకరణ**

నకిరేకల్ : స్థానిక ఆర్ఓ కార్యాలయంలో బుధవారం ఐదుగురు అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. సీపీఎం అభ్యర్థి బొజ్జ చిన వెంకులు, తెలంగాణ రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి మేడి సంతోష్, ధర్మసమాజ్ పార్టీ అభ్యర్థి యాతాకుల వెంకన్న, ఇండిపెండెంట్లుగా ఏర్పుల నరేష్, కొమ్ము శోభారాణి తమ నామినేషన్ పత్రాలను ఎన్నికల రిటర్నింగ్ అధికారి పాటిల్ హేమంత్ కేశవ్‌కు అందజేశారు.

# రాజకీయాలు వ్యాపారంగా మారాయి

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి



మాట్లాడుతున్న జూలకంటి రంగారెడ్డి

నల్లగొండ టౌన్ : రాష్ట్రంలో రాజకీయాలు ఒక వ్యాపారంగా మారాయని, పెట్టుబడులు పెట్టి లాభాలు పొందాలని కొన్ని పార్టీల్లోని నాయకులు ఎన్నికల్లో పోటీ చేస్తున్నారని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి ఆరోపించారు. బుధవారం స్థానిక ఫంక్షన్ హాల్‌లో జరిగిన సీపీఎం నల్లగొండ నియోజకవర్గ స్థాయి నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నిరంతరం ప్రజా సమస్యలపై పోరాటం చేస్తున్న నల్లగొండ నియోజకవర్గ సీపీఎం అభ్యర్థి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. తెలంగాణ ధనిక రాష్ట్రం అయినప్పటికీ అప్పుల రాష్ట్రంగా మార్చారని విమర్శించారు. పేదలకు ఇళ్ల స్థలాలు, డబుల్ బెడ్‌రూం ఇళ్లు, గృహలక్ష్మి పథకం పేదలకు కలగానే మారిందన్నారు, ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి సుత్తికొడవలి గుర్తుకు ఓటు వేసి గెలిపించాలన్నారు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి మాట్లాడుతూ సంక్షేమ ఫలాలు పేదలకు అందాలంటే కమ్యూనిస్టులను శాసనసభకు పంపాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సయ్యద్ హాషం, పాలడుగు నాగార్జున, ప్రభావతి, ఎండీ సలీం, దండెంపల్లి సత్తయ్య, వెంకటరమణారెడ్డి, పుచ్చకాయల నర్సిరెడ్డి, తుమ్మల పద్మ, కొండ అనురాధ, సైదులు, భిక్షం, కన్నయ్య, కృష్ణారెడ్డి, సరోజ, వెంకన్న, నరేష్, భూపాల్, అంజయ్య, యాదయ్య, లింగయ్య, అరుణ, మధుసూదన్‌రెడ్డి గౌతంరెడ్డి, ఇస్తారి, మల్లారెడ్డి పాల్గొన్నారు.

# అవకాశవాదులకు తగిన బుద్ధిచెప్పాలి

- మునుగోడు సీపీఎం అభ్యర్థి దోనూరి నర్సిరెడ్డి



మాట్లాడుతున్న దోనూరి నర్సిరెడ్డి

మునుగోడు : అవకాశవాద రాజకీయ నాయకులకు ఈ ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలని మునుగోడు నియోజకవర్గ సీపీఎం ఎమ్మెల్యే అభ్యర్థి దోనూరి నర్సిరెడ్డి కోరారు. బుధవారం మునుగోడులోని సీపీఎం కార్యాలయంలో నిర్వహించిన పార్టీ నియోజకవర్గస్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం ప్రకృతి సంపదను చౌక ధరలకు పారిశ్రామికవేత్తలకు అమ్ముతోందని, దీంతో నిత్యావసర సరుకుల ధరలు రోజు రోజుకూ పెరుగుతున్నాయని ఆరోపించారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం అనర్హులకు సంక్షేమ పథకాలు అందించి తిరిగి అధికారంలోకి వచ్చేందుకు ప్రయత్నాలు చేస్తోందన్నారు. మునుగోడులో కమ్యూనిస్టుల బలం నిరూపించుకునే సమయం వచ్చిందని, ప్రతి కార్యకర్త ఈ ఎన్నికల్లో సైనికుడిలా పనిచేసి సీపీఎంకు అధిక ఓట్లు వేయించాలని కోరారు. ఈ సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు బండా శ్రీశైలం, బండారి నర్సింహ, మండల కార్యదర్శులు నాంపల్లి చంద్రమౌళి, మిర్యాల భరత్, మొగుదాల వెంకటేషం, వరికుప్పల ముత్యాలు, బొట్టు శివ తదితరులు పాల్గొన్నారు.

### నేడు సర్వసభ్య సమావేశం

మర్రిగూడ : మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీపీ మెండు మోహన్‌రెడ్డి అధ్యక్షతన గురువారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ జె.వెంకటేశ్వర్లు తెలిపారు. ఆయా శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

### వ్యవసాయ బావిలో పడి వ్యక్తి మృతి



జైలు(ఫైల్ )

కేతేపల్లి : చెరువులో చేపలు పట్టేందుకు వెళ్లిన ఓ వ్యక్తి ప్రమాదవశాత్తు పక్కనే ఉన్న వ్యవసాయ బావిలో పడి మృతి చెందాడు. ఈ సంఘటన కేతేపల్లి మండలంలోని కొత్తపేట గ్రామంలో మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కొత్తపేట గ్రామానికి చెందిన చందుపట్ల జైలు(60)వ్యవసాయ కూలీగా జీవనం కొనసాగిస్తున్నాడు. జైలు మంగళవారం సాయంత్రం స్థానిక ఊర చెరువులో గాలంతో చేపలు పట్టేందుకు వెళ్లాడు. ఈ క్రమంగా జైలు చెరువు పక్కనే ఉన్న వ్యవసాయ బావిలో ప్రమాదవశాత్తు పడిపోయాడు. మంగళవారం రాత్రి పొద్దుపోయేంత వరకు కూడా జైలు ఇంటికి చేరుకోకపోవడంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు ఆచూకీ కోసం వెతికారు. రాత్రి 10 గంటల సమయంలో జైలు మృతదేహం బావిలో తేలి యాడుతూ కనిపించింది. స్థానికుల సహాయంతో కుటుంబ సభ్యులు జైలు మృతదేహాన్ని బావి నుంచి బయటకు తీశారు. సమాచారం అందుకున్న కేతేపల్లి పోలీసులు సంఘటనకు స్థలం వద్దకు చేరుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నకిరేకల్ ప్రభుత్వకి తరలించారు.

# కాంగ్రెస్‌లోకి పలువురు బీఆర్ఎస్ నాయకులు



నాంపల్లి : పార్టీలోకి ఆహ్వానిస్తున్న రాజగోపాల్‌రెడ్డి

మునుగోడు : మండలంలోని రావిగూడెం గ్రామానికి చెందిన వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు బుధవారం మునుగోడు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు భీమనపల్లి సైదులు, పాల్వాయి చెన్నారెడ్డి, జాల వెంకన్న యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

నాంపల్లి : లక్ష్మణాపురం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్తలు సింగిల్ విండో చైర్మన్ గట్టుపల్లి నర్సిరెడ్డి ఆధ్వర్యంలో బుధవారం కాంగ్రెస్ పార్టీ మునుగోడు ఎమ్మెల్యే అభ్యర్థి రాజగోపాల్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. కాంగ్రెస్‌లో చేరిన వారిలో మాజీ ఉప సర్పంచ్ గడ్డి మల్లయ్య, మారగోపి మల్లేష్, ఆమనగంటి భిక్షం, నారబోయిన లింగయ్య, నక్కనబోయిన లింగయ్య, జలగోని పెద్దయ్య, సత్యనారాయణ ఉన్నారు.

మర్రిగూడ : మండలంలోని తమ్మడపల్లి, కమ్మగూడ గ్రామాలకు చెందిన బీఆర్ఎస్ కార్యకర్తలు ఆయా గ్రామాల సర్పంచ్‌లు కొట్టం మాధవిరమేష్, మార్నేని నిర్మలలూర్దయ్య ఆధ్వర్యంలోకోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి సమక్షంలో బుధవారం మునుగోడులో కాంగ్రెస్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో రాందాసు శ్రీనివాస్, మాజీ జెడ్పీటీసీ మేతరి యాదయ్య, శంకర్, శ్రీనివాస్, రాజు, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

**వీరేశం సమక్షంలో..**

కట్టంగూర్ : కల్మెర గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు బుధవారం నకిరేకల్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి వేముల వీరేశం సమక్షంలో నకిరేకల్‌లో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పెద్ది సుక్కయ్య, రెడ్డిపల్లి సాగర్, మాజీ జెడ్పీటీసీ మాద యాదగిరి, గడుసు సుధీర్‌రెడ్డి పాల్గొన్నారు. పార్టీలో చేరిన వారిలో పిన్నపురెడ్డి మధురెడ్డి, కత్తుల శంకర్, వేముల సత్యనారాయణ, భరత్‌రెడ్డి, కత్తుల వెంకన్న, గిరి, లింగయ్య, యాదగిరి, వెంకన్న తదితరులు ఉన్నారు.



ఎంజీయూలో బుధవారం నిర్వహించిన స్నాతకోత్సవంలో గవర్నర్ తమిళిసైతో యూనివర్సిటీ పాలకవర్గ సభ్యులు, సిబ్బంది

# నష్టపరిహారం చెల్లించాలని పనుల అడ్డగింత

నాంపల్లి : కిష్టరాయినిపల్లి ప్రాజెక్ట్‌లో భూములు కోల్పోయిన భూ నిర్వాసితులకు పూర్తి నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేస్తూ బుధవారం మండలంలోని లక్ష్మణాపురం గ్రామ భూనిర్వాసితులు ప్రాజెక్ట్ పనులను అడ్డుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మునుగోడు ఉపఎన్నికల సందర్భంగా మంత్రి జగదీష్‌రెడ్డి హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో ప్లాట్లు ఇస్తామని హామీ ఇచ్చారని, ఆ హామీని మంత్రి ఇప్పటికీ నేరవేర్చలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉప ఎన్నికల్లో టీఆర్ఎస్ పార్టీకి మీ గ్రామం నుంచి గంపగుత్తగా ఓట్లు వేయాలని మంత్రి చెప్పడంతో అందరం ఓట్లు వేశామని, గెలిచిన తర్వాత ఎమ్మెల్యేను, మంత్రిని కలవడానికి కూడా అనుమతి ఇవ్వడం లేదని వాపోయారు. ప్రభుత్వం మా భూములను గుంజుకుని మమ్మల్నీ అనాథలు చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో భూ నిర్వాసితులు తదితరులు పాల్గొన్నారు.



కిష్టరాయినిపల్లి ప్రాజెక్ట్ పనులను అడ్డుకుంటున్న లక్ష్మణాపురం గ్రామస్తులు

# బీఆర్ఎస్‌లో పలువురు నాయకుల చేరిక




కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరుతున్న మేడిశెట్టి యాదయ్య

నల్లగొండ టూటౌన్ : వైఎస్సార్‌సీపీ మాజీ జిల్లా ప్రధాన కార్యదర్శి మేడిశెట్టి యాదయ్య బుధవారం నల్లగొండ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కంచర్ల భూపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో మంత్రి కేటీఆర్ సమక్షంలో హైదరాబాద్‌లో బీఆర్ఎస్ పార్టీ చేరారు. మేడిశెట్టి యాదయ్య వైఎస్సార్‌సీపీ స్థాపించక ముందు నుంచి జగన్‌తో నడిచారు.

**తిప్పర్తి, మాడ్గులపల్లి, నల్లగొండ నుంచి..**

నల్లగొండ నియోజకవర్గంలోని తిప్పర్తి, మాడ్గులపల్లి, నల్లగొండ పట్టణంలోని వివిధ వార్డుల్లో కాంగ్రెస్ పార్టీకి చెందిన 500 కుటుంబాలు బుధవారం బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు కంచర్ల కృష్ణారెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. 46వ వార్డు నుంచి మున్నా ఆధ్వర్యంలో కాంగ్రెస్‌కు చెందిన 300 కుటుంబాలు, 43, 45వ వార్డుల నుంచి కమల్ నాయుడు, నరేష్‌కుమార్ ఆధ్వర్యంలో 150 కుటుంబాలు కాంగ్రెస్‌లో చేరాయి. అదేవిధంగా మాడుగులపల్లి మండల కేంద్రం నుంచి కాంగ్రెస్ వార్డు మెంబర్ మాడుగుల రామకృష్ణ ఆధ్వర్యంలో 50 కుటుంబాలు చేరాయి. తిప్పర్తి మండలంలోని సర్వారం గ్రామానికి చెందిన పలువురు కాంగ్రెస్ కార్యకర్తలు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ చీర పంకజ్‌యాదవ్, మాడుగులపల్లి మాజీ ఎంపీటీసీ కందిమల్ల నరేందర్‌రెడ్డి, వెన్న శ్రవణ్‌రెడ్డి, పుల్లెంల ఏడుకొండలు, దర్శనం రాంబాబు, అప్పల మధు, సాయిశంకర్, సైదులు, అల్లు బెల్లి మాధవరెడ్డి, కందిమల్ల నాగలక్ష్మి, రామ్మూర్తి, చంద్రయ్య, ప్రసాద్, వెంకటయ్య పాల్గొన్నారు.

**బీఆర్ఎస్‌లో చేరిన శేపూరి రవీందర్**

చిట్యాల : బీజేపీకి రాజీనామా చేసిన ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శేపూరి రవీందర్ బుధవారం నకిరేకల్ ఎమ్మెల్యే అభ్యర్థి చిరుమర్తి లింగయ్య ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో మంత్రి కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఆయనతోపాటు బీజేపీ జిల్లా కార్యవర్గసభ్యుడు పల్లపు బుద్ధుడు,చెరుకు లింగస్వామి గౌడ్, చేపూరి రాజు, గోపగోని నర్సింహ, మేడి రవీందర్, బరిశెట్టి సత్యనారాయణ, పబ్బు లింగస్వామి, జన్నపాల శ్రీను, పోకల రాములు, ఇమ్మడి విజయ్‌లతోపాటు మరికొందరు ఉన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి జగదీశ్‌రెడ్డి, జెడ్పీ చైర్మన్ బండా నరేందర్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లికార్జున్‌రెడ్డి, చిట్యాల మున్సిపల్ వైస్ చైర్మన్ కూరెళ్ల లింగస్వామి, కర్నాటి ఉప్పల్‌రెడ్డి, వనమా వెంకటేశ్వర్లు, గోదుమగడ్డ జలందర్‌రెడ్డి, బైకాని నాగరాజు పాల్గొన్నారు.

### కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగం అధ్యక్షురాలిగా ఎర్ర చైతన్య



శాలిగౌరారం : కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగం శాలిగౌరారం మండల అధ్యక్షురాలిగా మండలంలోని చిత్తలూరు గ్రామానికి చెందిన ఎర్ర చైతన్య నియమితులయ్యారు. బుధవారం జిల్లా కేంద్రంలో చైతన్యకు భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, టీ పీసీసీ ఉపాధ్యక్షుడు చామల కిరణ్‌కుమార్‌రెడ్డి సమక్షంలో జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు గోపగాని మాధవి నియామకపత్రాన్ని అందజేశారు.

# శాలిగౌరారం మార్కెట్ యార్డుకు తాళం

- వర్షాలు కురుస్తుండడం, ధాన్యం పోసుకునేందుకు స్థలం లేకపోవడమే కారణం



శాలిగౌరారం వ్యవసాయ మార్కెట్ యార్డుకు తాళం వేసిన నిర్వాహకులు

శాలిగౌరారం: నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో రైతులు ధాన్యం తీసుకురాకుండా నల్లగొండ జిల్లా శాలిగౌరారం మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్‌యార్డు ప్రధాన గేటుకు బుధవారం ధాన్యం కొనుగోలు కేంద్రం నిర్వాహకులు తాళం వేశారు. ఈ విషయంపై సంబంధిత నిర్వాహకులు మాట్లాడుతూ మార్కెట్‌యార్డు మొత్తం సీసీ ప్లాట్‌ఫాం కావడంతో కొద్దిపాటి వర్షం కురిసినా ధాన్యం రాసులు వర్షపునీటికి తడుస్తూ రైతులు నష్టాలకు గురవుతున్నారన్నారు. అదేవిధంగా తడిసిన ధాన్యాన్ని ఆరబోసుకునేందుకు మార్కెట్‌యార్డు ఆవరణలో స్థల సమస్య కూడా ఏర్పడుతుందన్నారు. ఈ నేపథ్యంలో మార్కెట్‌యార్డు లోపలికి ధాన్యం తీసుకురాకుండా ముందస్తు చర్యల్లో భాగంగా మార్కెట్‌యార్డు ప్రధాన గేటుకు తాళం వేసినట్లు వివరించారు. రైతులు సమీపంలోని తిరుమలరాయునిగూడెంలో నేలకల్లలో కొనసాగుతున్న కొనుగోలు కేంద్రానికి తమ ధాన్యాన్ని తరలించి ప్రయోజనం పొందాలని కోరారు. వాతావరణం అనుకూలించి ఎండలు కొడితే ధాన్యం కొనుగోలు వేగవంతం చేసి మార్కెట్ యార్డు లోపలికి ధాన్యం అనుమతిస్తామన్నారు. రైతులు పరిస్థితులను గమనించి ధాన్యం కొనుగోలు కేంద్రం నిర్వాహకులకు సహకరించాలని కోరారు. వ్యవసాయ మార్కెట్ యార్డులోని ధాన్యం కొనుగోలు కేంద్రం ద్వారా ఇప్పటి వరకు 121 మంది రైతుల నుంచి 8,400 క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేశామని, సుమారు మరో 12 వేల క్వింటాళ్లకు పైగా ధాన్యం రాసులు నిల్వ ఉన్నట్లు నిర్వాహకులు తెలిపారు.

### రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



భిక్షం(ఫైల్)

మునుగోడు : రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన బుధవారం రాత్రి మండలంలోని సానబండ సమీపంలో చోటు చేసుకుంది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. చండూరు మండలంలోని దోనిపాముల గ్రామానికి చెందిన కొంక భిక్షం(45) నల్లగొండ మండలంలోని దోమలపల్లి ఎస్‌బీఐ లో అంటెడర్‌గా పనిచేస్తున్నాడు. భిక్షం రోజువారీగా విధులకు హాజరై రాత్రి 8గంటల సమయంలో తన ద్విచక్రవాహనంపై ఇంటికి బయలుదేరాడు. మార్గమధ్యలో మునుగోడు గ్రామ శివారులోని సానబండ సమీపంలో రోడ్డుపై కిందపడి అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతుడి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతుడు బైక్ అదుపు తప్పి పడిపోయాడా లేక గుర్తు తెలియని వాహనం ఢీకొని మృతి చెందాడా అనే అనుమానం కుటుంబ సభ్యులు, పోలీసులు వ్యక్తం చేస్తున్నారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నల్లగొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు.

### వరికి మద్దతు ధర ఇవ్వాలి



ఉప్పలపహాడ్‌లో తడిసిన ధాన్యం రాశులను పరిశీలిస్తున్న బొజ్జ చినవెంకులు

కేతేపల్లి : వరి ధాన్యానికి రూ.3000 మద్దతు ధర ప్రకటించి రైతులను ఆదుకోవాలని నకిరేకల్ నియోజకవర్గ సీపీఎం ఎమ్మెల్యే అభ్యర్థి బొజ్జ చినవెంకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అకాల వర్షానికి ఉప్పలపహాడ్ ధాన్యం కొనుగోలు కేంద్రంలో తడిసిన ధాన్యం రాశులను బుధవారం సీపీఎం నేతలతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా వెంకులు మాట్లాడుతూ రైతులు ఆరుగాలం కష్టించి పండించిన పంటకు గిట్టుబాటు ధర అందించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని విమర్శించారు. తడిసిన ధాన్యాన్ని ఎలాంటి షరతులు లేకుండా తక్షణమే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి సీహెచ్.లూర్దుమారయ్య, నాయకులు సోమయ్య, రామలింగం, సైదులు, లింగారెడ్డి పాల్గొన్నారు.

# గిట్టుబాటు ధరలేక పత్తి రైతుల ఆందోళన

- వర్షాలు సరిపడా లేకపోవడంతో తగ్గిన దిగుబడి
- ప్రస్తుతం మార్కెట్‌లో పడిపోతున్న పత్తి ధర
- ప్రభుత్వం బోనస్ చెల్లించాలని రైతుల వేడుకోలు



మునుగోడులోని పత్తి మిల్లులో ఉన్న పత్తి

మునుగోడు : ఈ ఏడాది అనుకున్న స్థాయిలో వర్షాలు కురవకపోవడంతో పత్తి పంట దిగుబడి అంతంత మాత్రంగానే వచ్చింది. కనీసం పెట్టుబడులు కూడా రాని పరిస్థితి నెలకొంది. మొదట్లో పత్తి ధర గత ఏడాది కంటే అధికంగా ఉండడంతో రైతులు కాస్త ఆనందపడ్డారు. కానీ రోజురోజుకూ ధర పడిపోతుండడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో పడిపోయారు.

**నాలుగు రోజుల క్రితం వరకు మద్దతు ధర కంటే అధికం ..**

మునుగోడు మండల వ్యాప్తంగా ఈ ఏడాది రైతులు 38 వేల ఎకరాల్లో పత్తి సాగుచేశారు. ప్రతి ఏడాది ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేసి రైతుల నుంచి పత్తిని కొనుగోలు చేస్తోంది. అయితే ఈ ఏడాది ప్రభుత్వం అందించే మద్దతు ధర కంటే బహిరంగా మార్కెట్‌లో అధికంగా ధర ఉండడంతో మూడు రోజు క్రితం వరకు మునుగోడులో సీసీఐ కేంద్రాలను ప్రారంభించలేదు. ఆగస్టు మాసం నుంచి పత్తి పంట చేతికి వస్తుండడంతో ఆ సమయంలో ప్రభుత్వ మద్దతు ధర రూ.7020 ఉంటే వ్యాపారులు క్వింటాలుకు రూ.200 నుంచి రూ. 300 వరకు అదనంగా చెల్లించి రైతుల నుంచి పత్తి కొనుగోలు చేశారు. దీంతో రైతులు తమ పత్తిని స్థానిక వ్యాపారులకు అమ్ముకున్నారు. అయితే మూడు, నాలుగు రోజుల నుంచి బహిరంగ మార్కెట్‌లో ప్రభుత్వ మద్దతు ధర కంటే రూ.100 నుంచి రూ.200 వరకు తక్కువ ధరకు క్వింటాలుకు రూ.6900 వరకు ప్రైవేటు వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు. దీంతో ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర కంటే ప్రైవేట్ వ్యాపారులు తక్కువగా చెల్లిస్తుండడంతో రైతులు పత్తిని అమ్ముకునేందుకు ఆసక్తి చూపలేదు.

**రెండు రోజుల క్రితం సీసీఐ కేంద్రాలు ప్రారంభం**

బహిరంగ మార్కెట్‌లో పత్తి ధర పడిపోవడంతో రైతుల నుంచి ప్రభుత్వ మద్దతు ధరకు పత్తి కొనుగోలు చేసేందుకు సీసీఐ అధికారులు రెండు రోజుల క్రితం మునుగోడు మండలంలో మూడు, చండూరు మండలంలో ఒక సీసీఐ కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. అయినా రైతులు అంతంత మాత్రంగానే తమ పత్తిని అమ్ముకుంటున్నారు. మద్దతు ధర కంటే అధికంగా ఉన్న సమయంలో ఒక్కో పత్తి మిల్లులో కనీసం 500 నుంచి 1000 క్వింటాళ్ల వరకు అమ్ముకున్న రైతులు ఇప్పుడు రోజుకు ఒక్కో మిల్లులో కనీసం 300 క్వింటాళ్ల పత్తి కూడా అమ్మడం లేదని సీసీఐ అధికారులు చెబుతున్నారు.

**బోనస్ ప్రకటించాలని..**

గతంలో పత్తి సాగు చేసిన రైతులకు కనీసం ఎకరానికి 5 క్వింటాళ్లకు తగ్గకుండా దిగుబడి వచ్చేది. ఆ పత్తి అమ్ముకుంటే సగటున క్వింటాలుకు రూ.7000 చొప్పున రూ.35వేల ఆదాయం వచ్చేది. అందులో ఖర్చులు అన్నీ కలిపి రూ.20 వేలు తీసివేసినా కనీసం రూ.15 వేల చొప్పున ఎకరానికి మిగిలేదని రైతులు చెబుతున్నారు. ఈ ఏడాది సరిపడా వర్షాలు లేకపోవడంతో ఎకరానికి 2 నుంచి 3 క్వింటాళ్ల దిగుబడి కూడా రాలేదని రైతులు వాపోతున్నారు. ఎకరానికి రూ.20వేల వరకు పెట్టుబడి పెడితే వచ్చేది మాత్రం కేవలం రూ.2వేల లోపు ఆదాయం ఉందని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక కౌలు రైతులు ఎకరానికి రూ.10 వేల చొప్పున అప్పులు చేసి చెల్లించాల్సి వస్తోందని చెబుతున్నారు. ప్రభుత్వం క్వింటాలుకు రూ.3వేల చొప్పున బోనస్ అందించి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

**దిగుబడి అంతంత మాత్రంగానే వచ్చింది**



“ ఈ ఏడాది వర్షాలు సరిగా కురవకపోవడంతో పత్తి దిగుబడి అంతంత మాత్రంగానే వచ్చింది. గతంలో ఎకరానికి 5 నుంచి 10 క్వింటాళ్ల వరకు వచ్చే దిగుబడి ఈ ఏడాది 3 క్వింటాళ్లకు మించి రావడం లేదు. దీంతో వచ్చిన దిగుబడి పెట్టుబడికే సరిపోతుంది.

-డొంకలి అంజయ్య, రైతు ఎల్లలగూడెం

**బోనస్ చెల్లించాలి**



“ వర్షాలు సరిగా కురవకపోవడంతో దిగుబడి చాలా తక్కువగా వచ్చి తీవ్రంగా నష్టపోయాం. రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం క్వింటాలుకు రూ.3వేల చొప్పున బోనస్ ప్రకటించాలి. మొదట అధిక ధర చెల్లించి కొనుగోలు చేసిన వ్యాపారులు ఇప్పుడు ధర తగ్గించి కొంటున్నారు.

-బండా శ్రీశైలం, రైతు సంఘం నాయకుడు